క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన గడ్డిఅన్నారం నాయకులు



ఎమ్మెల్యే బలాలకు సమస్యలు వివరిస్తున్న నాయకులు

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ గడ్డిఅన్నారానికి చెందిన నాయకులు మంగళవారం ఎమ్మెల్యే అహ్మద్ బలాలను పంజేషాహాలోని కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను ఎమ్మెలే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరామని ఎల్.బస్వరాజ్‌గౌడ్, లింగాల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ, అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వాటికి మరమ్మతులు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో ఎల్. శ్రీనప్పగౌడ్, జి. సురేష్‌గౌడ్ ఉన్నారు.

యువత క్రీడల్లో నైపుణ్యాలు పెంచుకోవాలి



క్రీడాకారులకు స్పోర్ట్స్ దుస్తులు అందజేస్తున్న లింగాల హరిగౌడ్

సైదాబాద్: యువత క్రీడల్లో నైపుణ్యాలు పెంచుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్ సూచించారు. మంగళవారం సైదాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పలువురు క్రీడాకారులకు స్పోర్ట్స్ దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడా సాధన వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం పెంపొందుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పలు పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. ఇటీవల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖేలో భారత్ కార్యక్రమం ద్వారా పలు క్రీడాంశాల్లో యువ క్రీడాకారుల ప్రతిభ వెలుగులోకి వచ్చిందన్నారు. మలక్‌పేట నియోజకవర్గ పరిధిలోని క్రీడాకారులకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నవీన్ కుమార్, శ్రీకాంత్, సుమన్, రమేష్, కిరణ్, నయీం, పాషా పాల్గొన్నారు.

అడవిని వీడి జనావాసాల్లోకి..!



నెమలిని అటవీశాఖ అధికారులకు అప్పగిస్తున్న సీఐ

హస్తినాపురం: అడవిలో ఉండాల్సిన నెమలి జనావాసాల మధ్యకు రావడంతో దానిని స్థానికులు పట్టుకొని వనస్థలిపురం పోలీసులకు అప్పగించారు. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ దేప జలేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీలోని ఇళ్ల మధ్య మంగళవారం జాతీయపక్షి నెమలి తచ్చాడుతుండగా కాలనీవాసులు పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే గుర్రంగూడ అటవీశాఖ అధికారులను పిలిపించి నెమలిని వారికి అప్పగించారు.

కొత్త వ్యక్తుల సంచారంపై అప్రమత్తంగా ఉండాలి



సీఐ జలంధర్‌రెడ్డిని సత్కరిస్తున్న కాలనీవాసులు

ఎల్‌బీనగర్: కాలనీలో కొత్త వ్యక్తుల సంచారంపై కాలనీ వాసులు అప్రమత్తంగా ఉండాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ జలంధర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో ఏర్పాటు చేసిన కాలనీ సూచిక బోర్డులను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, కాలనీలోకి వచ్చే వారికి ఈ సూచిక బోర్డులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కొత్త వ్యక్తులపై కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలని అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సీఐకు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లచ్చిరెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణ, లక్ష్మణచారి, రామాచారి, జంగయ్యగౌడ్, శంకర్‌నాయక్, శ్రీను, రాజు, పురుషోత్తం, మహేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ పాలన అంతం.. బీజేపీకే సాధ్యం

- 'బండి' నాయకత్వంలో అనేక విజయాలు సాధించాం
- ప్రాంతీయ పార్టీల్లా జీవితాంతం ఒకే అధ్యక్షుడు ఉండరు
- వచ్చే ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక చాలా పటిష్టంగా చేపడతాం
- బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్



విలేకరులతో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

హయత్‌నగర్: రాష్ట్రంలో కుటుంబ, అవినీతి, నిరంకుశ పాలనను అంతం చేయడం బీజేపీకే సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రజలు నమ్ముతున్నారని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్రంలో కాషాయ జెండా ఎగరాలని ప్రజలు కోరుకుంటున్నారని పార్టీ అధిష్టానం గుర్తించిందని, ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. మంగళవారం శామీర్‌పేట నుంచి మహేశ్వరం వైపు వెళ్తూ మార్గం మధ్యలో ఆయన హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా ఈటల విలేకరులతో మాట్లాడుతూ, ప్రతి రాజకీయ పార్టీ అంతిమ లక్ష్యం అధికారంలోకి రావడమే అని, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలని పార్టీ అధిష్టానం పట్టుదలతో ఉందన్నారు. పార్టీ అధికారంలోకి రావాలని 40 ఏళ్లుగా కంటున్న కార్యకర్తల కలను నిజం చేసేందుకు అధిష్టానం తమకు బాధ్యతలు అప్పగించిందన్నారు. తన 20 ఏళ్ల రాజకీయ అనుభవంలో గెలుపు, ఓటములు తెలిసిన వాడిగా పార్టీ అధిష్టానం ముఖ్యమైన బాధ్యతలను తనకు అప్పగించిందని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ గెలుపు కోసం శాయశక్తులా పని చేస్తానన్నారు. ప్రాంతీయ పార్టీల మాదిరిగా బీజేపీలో జీవితాంతం ఒక అధ్యక్షుడు ఉండరని, పార్టీ అందరికీ అవకాశం కల్పిస్తుందన్నారు. కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా పనిచేసిన బండి సంజయ్ నాయకత్వంలో అనేక విజయాలు సాధించామని, ఆయన నాయకత్వంలో పార్టీ బలోపేతమైందన్నారు. గతంలో రెండుసార్లు రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన కిషన్ రెడ్డికి రాష్ట్ర పరిస్థితులపై పూర్తి అవగాహన ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక చాలా పటిష్టంగా ఉంటుందని, టికెట్ ఆశిస్తున్న వారి గెలుపు అవకాశాలు, ప్రజల్లో వారికి ఉన్న ఉన్న ఆదరణ, వారి చరిత్రను పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఎలాంటి మచ్చ రాకుండా తన బాధ్యతలు నెరవేరుస్తానని ఈటల స్పష్టం చేశారు. ఆయన వెంట బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి,కొప్పుల నర్సింహారెడ్డి ఉన్నారు.

మహిళలకు కాంగ్రెస్ అండగా ఉంటుంది: మల్‌రెడ్డి



కుట్టు మిషన్ శిక్షణ పొందుతున్న మహిళలతో కాంగ్రెస్ నేత రాంరెడ్డి తదితరులు

ఎల్‌బీనగర్: మహిళలకు కాంగ్రెస్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని, మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషి చేసిందని ఆ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన చైతన్యపురి డివిజన్ పీ అండ్ టీ కాలనీలో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించి అక్కడ శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. మహిళల రక్షణ కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం కంటితుడుపు చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో పురుషులతో సమానంగా మహిళలు పాల్గొన్నారని, తెలంగాణ సాధనలో వారి కృషి ఎంతో ఉందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కర్ణాటక తరహాలో మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించేందుకు చర్యలు తీసుకుంటామని, మహిళ అభివృద్ధికి అన్ని చర్యలూ తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ వెంకటేశ్‌యాదవ్, డివిజన్ అధ్యక్షులు వేణు యాదవ్, నాయకులు సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సూర్య, నరేందర్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఎంతో మేలు



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎంతో మంది పేదలకు ఎంతో మేలు జరుగుతోందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ గ్రీన్ పార్క్ కాలనీకి చెందిన అద్విక్ గుండె సంబంధిత వ్యాధితో ఆసుపత్రి చికిత్స పొందాడు. అతడి ఆర్థిక పరిస్థితి బాగోగకపోవడంతో ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డిని కలిసి తనను ఆదుకోవాలని కోరాడు. దీంతో ఎమ్మెల్యే అతడితో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించి రూ. లక్ష ఆర్థిక సాయం మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన చెక్కును మంగళవారం లబ్ధిదారుడి కుటుంబానికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అందజేశారు.

విప్లవ వీరుడు అల్లూరికి ఘన నివాళి



అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న గిరిజన సంఘం నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: భారత స్వాతంత్ర్యం కోసం గెరిల్లా యుద్ధరీతిలో పోరాడిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని తెలంగాణ గిరిజన సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.గోపీ నాయక్ అన్నారు. మంగళవారం ఆర్‌కేపురం డివిజన్‌లోని చిత్ర లేవుట్ రంగారెడ్డి జిల్లా కోర్టు దగ్గర గిరిజన సంఘం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 126 వ జయంతి వేడుకలు నిర్వహించారు. సందర్భంగా అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపి నాయక్ మాట్లాడుతూ. బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదిరించి సాయుధ పోరాటం చేసి తనను నమ్ముకున్న ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన మహోజ్వల శక్తి అల్లూరి అని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కట్ట శ్రీనివాస్, సీఐటీయూ సీనియర్ నాయకులు రాములు, పరశురాములు పాల్గొన్నారు.

కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్‌ను నియమించాలి

చాదర్‌ఘాట్: రాష్ట్రంలో వందలాదిగా ఉన్న సోషల్ వెల్ఫేర్ గురుకులాలకు కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించాలని కుల నిర్మూలన వేదిక అధ్యక్షుడు పాపని నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. గురుకులాల్లో పేరుకుపోయిన అవినీతి, అధికారుల నిర్లక్ష్యం, నిద్రావస్థను పారద్రోలటానికి సమర్థవంతమైన అధికారులను నియమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసినట్లు తెలిపారు.

మార్గం రాజేష్‌కు సీతారామరాజు స్మారక పురస్కారం



రాజేష్‌కు పురస్కారం అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్‌కు అల్లూరి సీతారామరాజు స్మారక పురస్కారం లభించింది. గత మూడు దశాబ్దాలుగా అనాథ, నిరుపేద విద్యార్థులకు తమ అనాథ విద్యార్థి గృహం ద్వారా ఉచిత భోజన, వసతి, విద్యా సౌకర్యాలు కల్పిస్తున్నందుకు ఆయనను ఈ అవార్డు వరించింది. అల్లూరి సీతారామ రాజు 125వ జయంతి ఉత్సవాల సందర్భంగా పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్-ఎస్ఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులను ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా మార్గం రాజేష్‌కు తెలంగాణ టూరిజం కార్పొరేషన్ పూర్వ చైర్మన్-ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస గుప్తా చేతుల మీదుగా అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి మధుసూదన్ రావు, పినాకిని అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్ రాజు, కళానికేతన్ అధ్యక్షుడు శ్యామ్ ప్రసాద్, దైవజ్ఞ శర్మ అతిథిగా హాజరయ్యారు.

సైదాబాద్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

సైదాబాద్: డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి సైదాబాద్ హౌసింగ్‌బోర్డ్ కాలనీ, హసాఫియా గ్రేవ్ యార్డ్‌లో నిర్మిస్తున్న పాత్‌వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సైదాబాద్ వాసులకు తాగునీరు, వీధి దీపాలు, రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, కమ్యూనిటీహాల్‌లు, ఫుట్‌పాత్‌లు వంటి విషయాల్లో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న, రాజ్‌కుమార్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

బూత్‌స్థాయి నుంచి బీజేపీ పటిష్టతకు కృషి



పార్టీ విస్తారక్‌లను సన్మానించిన సంరెడ్డి సురేందర్‌రెడ్డి

సైదాబాద్: తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా గెలుపే లక్ష్యంగా బూత్‌స్థాయి నుంచి బీజేపీ పటిష్టతకు కృషి చేస్తున్నామని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భాగ్యనగర్ జిల్లా పరిధిలోని నియోజకవర్గాలకు విచ్చేసిన బీజేపీ విస్తారక్‌లకు ఆయన మంగళవారం సైదాబాద్‌లో శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ, మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా జిల్లా పరిధిలోని మలక్‌పేట, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా నియోజకవర్గాల్లోని అన్ని బూత్ కమిటీలతో పార్టీ విస్తారక్‌లు గత వారం రోజులుగా 'మేరా బూత్ సబ్‌సే మజుబూత్' కార్యక్రమాలు నిర్వహించారని వివరించారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా నియమితులైన జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

రైతుబజార్ ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా 75, వంకాయ 35, బెండ 40, పచ్చిమిర్చి 90, కాకర 55, బీర 40, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 18, కారెట్ 50, దొండ 55, ఆలు 22, ఉల్లి 22, గోకర 35, దోస 21, సొర 15, పొట్ల 23, అరటి 10, చిక్కుడు 75, అర్వి 38, మునగ 55, చిలగడదుంప 28, బీట్‌రూట్ 23, కీర 40, ఫ్రెంచ్ బీన్స్ 100.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం



పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారితో పూర్వ విద్యార్థులు

లింగోజిగూడ: సరూర్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాల 1980 పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించిన 13 మంది 10వ తరగతి విద్యార్థులను మంగళవారం సన్మానించి, బహుమతులు అందజేశారు. అలాగే, పూర్వ విద్యార్థులు రచయిత రమాదేవి, వైద్యులు స్వాతిరెడ్డి సేవాలను గుర్తించి వారిని సత్కరించారు. అనంతరం పూర్వ విద్యార్థి విరుపాక్ష తన సోదరుడు విద్యాభూషణ్ జ్ఞాపకార్థం పాఠశాలకు క్రీడా పరికరాలు అందజేశారు. పూర్వ విద్యార్థులు బాల్‌రెడ్డి, రాఘునాథ్‌శర్మ, శ్రీనివాస్, జీవన్, శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద



వివేకానందుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న శ్వేతామధుకర్‌రెడ్డి తదితరులు

సైదాబాద్: నేటి తరం యువతకు స్వామి వివేకానంద స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తారని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వివేకానందుడి వర్ధంతి సందర్భంగా ప్రెస్‌కాలనీలోని ఆయన విగ్రహానికి కార్పొరేటర్ బీజేపీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆశయ సాధనకు కృషి...

వివేకానందుడి ఆశయ సాధనకు కృషి చేస్తామని బీఆర్‌ఎస్ యాకుత్‌పురా ఇన్‌చార్జ్ సామ సుందర్ రెడ్డి అన్నారు. మంగళవారం ప్రెస్‌కాలనీలోని వివేకానందుడి విగ్రహానికి ఆయన బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వర్షాకాలం లోపు బాక్స్ డ్రైనేజీ పనులు పూర్తి చేయండి

నాగోలు: వర్షా కాలంలోపు కొత్తపేట డివిజన్‌లోని బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అధికారులకు సూచించారు. మంగళవారం కొత్తపేట డివిజన్ బృందావన్ కాలనీలో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఎస్‌ఆర్ఎల్ కాలనీ నుంచి బృందావన్ కాలనీ మీదుగా మూసీనది వరకు నూతన బాక్స్ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తామన్నారు. ఏఈ మాతృనాయక్‌తో కలిసి ట్రంక్ లైన్ ఎటువైపుగా వెళ్తుందో పరిశీలించారు, అనంతరం బాక్స్ డ్రైనేజీ పనులు వెంటనే మొదలు పెట్టాలని, కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తి చేయాలని ఏఈకి సూచించారు. అనంతరం నూతనంగా ఏర్పాటైన బృందావన్ కాలనీలో సీసీ రోడ్లు దశలవారీగా నిర్మిస్తామని, కాలనీలో ఇప్పటికే కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేయించామని, విద్యుత్ దీపాలు త్వరలోనే బిగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి



బైక్ ర్యాలీలో పాల్గొన్న విస్తారక్ ఇన్‌చార్జ్ అశోక్‌కుమార్, రంగారెడ్డి, లచ్చిరెడ్డి తదితరులు

ఎల్‌బీనగర్: బీజేపీని బలోపేతం చేసి, వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలను అల్పకాలిక విస్తారక్ (తమిళనాడు) ఇన్‌చార్జ్ అశోక్‌కుమార్ అన్నారు. బీజేపీ నిర్వహించిన మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా మంగళవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్‌ర్యాలీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీని బలోపేతం చేసేందుకు తనను ఇక్కడికి పంపారని, బూత్ లెవల్‌లో పార్టీ బలంగా ఉందని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల కోసం పార్టీని బలోపేతం చేసేందుకు ఈ ర్యాలీలు, బూత్ లెవల్ స్థాయి సమావేశాలు నిర్వహించామని తెలిపారు. అందరూ సమష్టిగా పనిచేయాలని కోరారు. కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మాట్లాడుతూ, డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ప్రజలు బీజేపీ వైపే ఉన్నారన్నారు. పార్టీ విజయానికి, పటిష్టతకు అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, భూపాల్‌రెడ్డి, రఘురాంనేత, నర్సింహారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, మెట్టుపల్లి సంతోష్‌రెడ్డి ,శంకరయ్య, శరత్, ఆదిలక్ష్మి, బ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన సోహేల్ ఉద్దీన్



సోహేల్ ఉద్దీన్‌ను అభినందిస్తున్న సీపీ సీవీ ఆనంద్

మలక్‌పేట: మూసారంబాగ్‌కు చెందిన మహమ్మద్ సోహేల్ ఉద్దీన్ హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్‌ను మంగళవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశాడు. ఇటీవల దుబాయ్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి బెస్ట్ డిప్లొమాట్ ఇంటర్నేషనల్ సమ్మిట్‌లో భారతదేశం తరపున ప్రతినిధిగా సోహేల్ ఉద్దీన్ పాల్గొన్నాడు.ఆ సదస్సు విశేషాలను సీపీతో పంచుకున్నాడు. ఈ సందర్భంగా సీపీ ఆనంద్ సోహేల్ ఉద్దీన్‌ను అభినందించారు.

ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని డీఆర్‌డీఎల్ కాలనీలో ఆమె స్థానికులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా సుజాతానాయక్ మాట్లాడుతూ, కాలనీలోని పార్కులో అర్ధంతరంగా ఆగిపోయిన టైల్స్ ఏర్పాటు పనులతో పాటు పార్కు ప్రహరీ పక్కన ఫుట్‌పాత్‌ను వెంటనే నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీలో మధ్యలో సగంలో ఆగిపోయిన డ్రైనేజీ లైన్ పనులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పూర్తి చేయిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాంప్రసాద్, కాలనీ ప్రతినిధులు కరుణాకర్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, సాంబశివరావు, సోమశేఖర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని పునర్నిర్మించడం అభినందనీయం



రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్లు

హయత్‌నగర్: భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విశ్వాసం పొందిన అమ్మవారి ఆలయాన్ని పునర్నిర్మించడం ఎంతో అభినందనీయమని కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో నిర్మించనున్న హయత్‌నగర్‌లోని రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవ వాల్‌పోస్టర్, కరపత్రాన్ని మంగళవారం వారు ఆవిష్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్ర రవీందర్, గౌరవ అధ్యక్షుడు పారంద స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి గజ్జి భాస్కర్‌యాదవ్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, బీజేపీ నాయకులు బండారి భాస్కర్, పారంద మహేష్, టీఆర్‌ఎస్ నాయకుడు బోడ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

'శంకుస్థాపనలు తప్ప... పనుల పూర్తిలో చిత్తశుద్ధి లేదు'



శిలాఫలకానికి పాలాభిషేకం చేస్తున్న సామ రంగారెడ్డి

హస్తినాపురం: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులకు ఆర్భాటంగా శంకుస్థాపనలు చేయడమే తప్ప పనులు పూర్తి చేయడంలో చిత్తశుద్ధి లేదని రంగారెడ్డి అర్బన్‌జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. మంగళవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని సత్యదేవ్ ఎన్‌క్లేవ్‌కాలనీ, ఇంద్రప్రస్థకాలనీ, గోకుల్ ఎన్‌క్లేవ్‌కాలనీ, సాయినగర్‌కాలనీలలో ఇంటింటికీ బీజేపీ యాత్రలో భాగంగా డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పి.నరేశ్‌యాదవ్‌తో కలిసి రంగారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ, గత తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీహెచ్‌ఎంసీ నిధులను అభివృద్ధి పనులకు కేటాయించకుండా దారి మళ్లించిందని ఆరోపించారు. జీహెచ్‌ఎంసీ అప్పుల కుప్పగా మారడానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వ అసమర్థపాలనే కారణమన్నారు. భూపేశ్‌గుప్తానగర్ కాలనీలో 2017 జూన్ 6న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి నేటికీ పూర్తి చేయలేదని, వెంటనే పనులు పూర్తి చేయాలని కోరుతూ శిలాఫలకానికి రంగారెడ్డి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో అమరేందర్ రెడ్డి, మాధవరెడ్డి, శ్రీనివాస్, సాయి, మల్లేశ్‌గౌడ్, రాజేందర్,మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.